సాక్షి నిజామాబాద్

సోమవారం । 23 । అక్టోబర్ । 2023

I



శక్తివంతమైన సమాజం కోసం..

శక్తివంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ఆర్ఎస్ఎస్ స్థాపించబడిందని ఇందూరు విభాగ్ సహ కార్యవాహ శ్రీనివాస్ పేర్కొన్నారు.

- IIలో ▸



ఘనంగా సద్దుల బతుకమ్మ

జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంగరంగ వైభవంగా జరిగాయి. సద్దుల బతుకమ్మ వద్ద ఉత్సాహంగా ఆడిపాడారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
33.3 /20.1

వాతావరణం

ఆకాశం ఉదయం నిర్మలంగా ఉంటుంది. ఎండతీవ్రత ఉండవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం చల్లటిగాలులు వీస్తాయి. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు



సుభాష్‌నగర్ : విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలకు రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా ప్రతీక అని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అందరూ విజయదశమి పండుగను ఆనందంగా జరుపుకోవాలని పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు.

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు..



విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే విజయదశమి వేడుకను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

31 వరకు పోలీస్ సంస్మరణ వారోత్సవాలు

ఖలీల్‌వాడి : జిల్లా పోలీస్ సిబ్బంది తమ ప్రాణాలను విధి నిర్వహణలో భాగంగా త్యాగం చేయడం జరిగిందని, వారి త్యాగం ఫలితంగానే ఇప్పుడు శాంతియుత వాతావరణం నెలకొందని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి 31 వరకు నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజనల్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో నిర్వహిస్తామన్నారు. ఆదివారం డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్‌లోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. 24న వ్యాసరచన పోటీలు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై, ఏఆర్ఎస్సై, ఎస్సై నుంచి ఆ పై స్థాయి వరకు ఆన్‌లైన్ లో నమోదు చేసుకోవాలన్నారు. 25న ఆన్‌లైన్ ఓపెన్ హౌస్, ఫిజికల్ ఓపెన్ హౌస్, 26న క్యాండిల్ ర్యాలీ గాంధీ చౌక్ నుంచి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు నిర్వహిస్తామన్నారు. 28న షార్ట్ ఫిల్మ్ కాంపిటేషన్స్, 28న ఫొటోగ్రఫీ కాంటెపేషన్స్ ఉంటాయని, పోలీసులకు సంబంధించిన అంశాలే ఉంటాయన్నారు.

ఈవీఎంల తరలింపు ప్రక్రియ పూర్తి



సుభాష్‌నగర్ : సాధారణ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా చేపట్టిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) తరలింపు ప్రక్రియ ఆదివారం పూర్తయ్యింది. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుంచి ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు ఈవీఎంలు తరలించే ప్రక్రియ శనివారం చేపట్టగా, ఆదివారం సాయంత్రం వరకు కొనసాగింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చిత్రా మిశ్రా, పి యాదిరెడ్డి పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఈవీఎంల తరలింపు సాఫీగా ముగిసింది. మున్సిపల్ కమిషనర్ ఎం మకరంద్, నిజామాబాద్ రూరల్, బోధన్, బాన్సువాడ, ఆర్మూర్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్, భుజంగరావు, వినోద్ కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోతెలో కబడ్డీ పోటీలు




వేల్పూర్: మండలంలోని మోతె గ్రామంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. గ్రామంలోని యువకులు పోటీల్లో పాల్గొని, ప్రతిభ చాటారు. బీఆర్ఎస్ నాయకులు దొల్ల రాజేశ్వర్‌రెడ్డి, పాలెపు బాల్‌రాజ్, మోతె రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విడతల వారీగా..

- అభ్యర్థుల జాబితాలు విడుదల చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్
- బాల్కొండ, ఆర్మూర్ నుంచి మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారు
- రూరల్, బాన్సువాడ, ఎల్లారెడ్డిలో ఖరారు కాని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు
- జుక్కల్, కామారెడ్డిలో అభ్యర్థులను పెండింగ్‌లో పెట్టిన కాంగ్రెస్
- బోధన్‌లో బీజేపీ, అర్బన్‌లో కాంగ్రెస్ అభ్యర్థుల విషయమై తర్జనభర్జన
- ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు మహిళా అభ్యర్థులు

శాసనసభకు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లాలో బీఆర్ఎస్ ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించింది. కాని రెండు ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు మాత్రం విడతలవారీగా అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తున్నాయి. దీంతో జిల్లాలో అభ్యర్థుల విషయపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో నామినేషన్లు దాఖలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉన్న నేపథ్యంలో ఇప్పటికే ఖరారైన అభ్యర్థులు, ఆశావహులు ఆయా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ ముందుగానే సిట్టింగ్‌లకు మరోసారి అవకాశం ఇవ్వడంతో ఆయా అభ్యర్థులు ఇప్పటికే ప్రచారంలో ఉన్నారు. రెండు ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు మాత్రం విడతలవారీగా అభ్యర్థుల జాబితాలు విడుదల చేస్తుండడంతో జిల్లాలో ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ మొదటి జాబితాలో ఉమ్మడి జిల్లాలో బాల్కొండ, బోధన్, ఆర్మూర్ నియోజకవర్గాలకు సునీల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వినయ్‌రెడ్డిలను ప్రకటించింది. నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ, కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డి సీట్ల విషయం పెండింగ్‌లో ఉంది. బీజేపీ విషయానికి వస్తే బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, జుక్కల్, కామారెడ్డి స్థానాలకు అన్నపూర్ణమ్మ, రాకేష్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, అరుణతార, వెంకటరమణారెడ్డిలను ఖరారు చేసింది. దీంతో బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారైనట్లైంది. నిజామాబాద్ అర్బన్‌లో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారు కాగా, కాంగ్రెస్ అభ్యర్థి విషయమై ఢిల్లీ స్థాయిలో తర్జనభర్జన సాగుతుండడం గమనార్హం.

స్పష్టత కరువు

ఇక నిజామాబాద్ రూరల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రత్యర్థులెవరనే విషయమై స్పష్టత లేకుండా పోయింది. బోధన్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రత్యర్థిగా బీజేపీ నుంచి మేడపాటి ప్రకాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డిల్లో ఎవరు వస్తారనేది తేలాల్సి ఉంది. కామారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థిగా భావిస్తున్న సీనియర్ నేత షబ్బీర్‌అలీ పేరు సైతం ఖరారు చేయకపోవడం గమనార్హం. జుక్కల్ విషయానికి వస్తే బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రత్యర్థిగా కాంగ్రెస్ నుంచి ఎవరు బరిలో ఉండనున్నారనే విషయమై ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లాలో ప్రధాన పార్టీల నుంచి ఇప్పటివరకు ఇద్దరు మహిళా అభ్యర్థులు మాత్రమే బీజేపీ నుంచి ఖరారయ్యారు. అన్నపూర్ణమ్మ, అరుణతారలిద్దరూ గతంలో టీడీపీ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. మిగిలిన టికెట్లలో కాంగ్రెస్, బీజేపీలు మహిళా అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు లేవు. ఇక బీఆర్ఎస్ నుంచి మహిళా అభ్యర్థులే లేరు. అయితే ఉమ్మడి జిల్లాలోని 9 నియోజకవర్గాల్లోనూ మహిళల ఓట్ల సంఖ్యే అత్యధికంగా ఉంది. ఈ నేపథ్యంలో సుదీర్ఘకాలం తర్వాత ఈసారి జిల్లా నుంచి మహిళా ఎమ్మెల్యేలు శాసనసభలో అడుగుపెడతారా అనేది చూడాలంటే డిసెంబర్ 3వ తేదీ వరకు ఆగాల్సిందే.



నగరంలోని వీక్లీమార్కెట్‌లో గుమ్మడికాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నేడు దసరా

నిజామాబాద్ సిటీ : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి. సోమవారం దసరా సందర్భంగా శమి, ఆయుధపూజ, వాహన పూజలు నిర్వహిస్తారు. నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో రావణ దహనానికి ఏర్పాట్లు చేశారు. అశ్వయుజశుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు మొదటి తొమ్మిదిరోజులు శరన్నవరాత్రులుగా జరుపుకుంటారు.

చివరి మూడురోజులను దుర్గాష్టమి, మహార్నవమి, విజయ దశమిగా జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది.



జగన్మాతకు భక్తితో పూజలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు మహాగౌరిగా దర్శనమిచ్చారు. జిల్లావ్యాప్తంగా మండపాల వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్ నిజామాబాద్

పకడ్బందీ నిఘా

- కోడ్ అమలుకు తనిఖీ టీంలు
- రంగంలోకి ఏడు బృందాలు



కందకుర్తి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడంపై దృష్టి సారించిన అధికారులు నిఘా ముమ్మరం చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను అమలు చేసేందుకు ఏడు తనిఖీ బృందాలను నియమించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులను బృందాల్లో సభ్యులుగా చేసి రంగంలోకి దింపారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో 24గంటలపాటు తనిఖీలు చేపడుతున్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్

ఎలక్షన్ కోడ్ అమలును ఫ్లయింగ్‌స్క్వాడ్ టీం పర్యవేక్షిస్తుంది. ప్రచారంలో ఎలక్షన్ కోడ్ ఉల్లంఘనపై అందే ఫిర్యాదులపై స్పందించి తనిఖీలు నిర్వహిస్తారు. సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను గంటన్నరలోగా పరిష్కరించే బాధ్యతను ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం తీసుకుంటుంది. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం, నేషనల్ గ్రీవెన్స్ సెల్‌కు రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులను పరిష్కరిస్తుంది. 17 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఉన్నాయి.

స్టాటిస్టిక్ సర్వైలెన్స్(ఎస్ఎస్టీ)

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంకాగానే స్టాటిస్టిక్ సర్వైలెన్స్ బృందాల తనిఖీ మొదలవుతుంది. ఒక్కో టీంలో ముగ్గురు సభ్యులు ఉంటారు. 24 గంటలపాటు పని చేస్తారు. రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, సమావేశాల ఖర్చుల సమాచారంపై రహస్యంగా వీడియోలు చిత్రీకరిస్తారు. సరిహద్దు, సమస్యాత్మక ప్రాంతాల్లో మకాం వేసి కోడ్ అమలును పర్యవేక్షించడంతోపాటు వాహనాలను తనిఖీ చేస్తారు. నాలుగు బృందాల్లో ఆరుగురు చొప్పున సభ్యులు ఉంటారు.

వీడియో వ్యూయింగ్ బృందం(వీవీటీ)

వీడియో వ్యూయింగ్ బృందంలో నాయబ్ తహసీల్దార్(డీటీ), ఇద్దరు సహాయకులు ఉంటారు. వీరు స్టాటిస్టిక్ సర్వైలెన్స్(ఎస్ఎస్టీ) బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్(ఎఫ్ఎస్టీ) బృందాలు, వీడియోగ్రాఫర్లు చిత్రీకరించిన వీడియోలను పరిశీలించి కోడ్ ఉల్లంఘనపై ఎన్నికల అధికారులకు నివేదిస్తారు. రెండు బృందాలు ఉంటాయి.

వీడియో సర్వైలెన్స్ బృందాలు(వీఎస్టీ)

వీడియో సర్వైలెన్స్ టీంలు సభలు, సమావేశాల్లో రాజకీయనాయకులు, అభ్యర్థుల ప్రసంగాలు, ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలను వీడియో చిత్రీకరిస్తారు. ఏపీఎం, ఒక సహాయకుడు, ఓ వీడియోగ్రాఫర్ ఉంటారు. వీరు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారు. ఈ టీమ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రోజువారీ వివరాలను అందిస్తుంటారు. నియోజవకర్గానికి ఓ బృందం ఉంటుంది.

మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) టీంలు

మండల స్థాయిలో ఎంపీడీవోలు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో కమిషనర్లు ఎన్నికల నియమావళిని పరిశీలిస్తారు. కోడ్ ఉల్లంఘనపై అధికారులకు నివేదిస్తారు.

అకౌంటింగ్ బృందాలు

నియోజకవర్గానికో అకౌంటింగ్ బృందాన్ని ఎన్నికల సంఘం కేటాయించింది. రాజకీయ పార్టీలు చేసే ఖర్చులపై కసరత్తు చేస్తుంది. ఎస్టీవోకు చెందిన సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో ఈ టీం తనిఖీలు చేస్తుంది. రెండు బృందాల్లో ఆరుగురు ఉంటారు.

ఖర్చుల పరిశీలన

ఖర్చుల పరిశీలనకు ఎన్నికల సంఘం బృందాన్ని ఏర్పాటు చేసింది. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి సంబంధించిన, ఇతర ఖర్చులను పరిశీలించి వివరాలను తెలుసుకుంటారు.ఈ బృందంలో ఓ అధికారి, ఓ సహాయకుడు, ఇద్దరు ఎంపీఎస్ఓలు ఉంటారు. ఒక్కో నియోజకర్గంలో ఓ బృందం పర్యవేక్షిస్తుంది.

సరిహద్దుల్లో నిరంతర నిఘా

రెంజల్(బోధన్): ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పోలీసు శాఖ రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేసింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడటం, కోడ్ అమల్లోకి రావడంతో తనిఖీలను ప్రారంభించింది. అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి నగదు, మద్యం రాకుండా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏ ర్పాటు చేసి నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు. మహారాష్ట్ర వైపునుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే వదులుతున్నామని రెంజల్ ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. 24గంటలపాటు అప్రమత్తంగా ఉంటున్నామని, గ్రామాల్లో మద్యం విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బీజేపీ వస్తే కమీషన్లు, కబ్జాలు ఉండవు



మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్ : బీఆర్ఎస్ పార్టీ అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని, కబ్జాలు.. కమీషన్లలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందని, బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. బీజేపీ అర్బన్ అభ్యర్థిగా ధన్‌పాల్ సూర్యనారాయణను ప్రకటించిన సందర్భంగా ఆయన నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తనకు అర్బన్ టికెట్ కేటాయించినందుకు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాని మోదీ, అమిత్ షా, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్, యెండల లక్ష్మీనారాయణ, పల్లె గంగారెడ్డి, బస్వా లక్ష్మీనర్సయ్యతోపాటు సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. తాను నగరంలోనే పుట్టి పెరిగానని, పక్కా లోకల్ అన్నారు. ట్రస్ట్ ద్వారా ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. బీఆర్ఎస్ పార్టీ మహిళాలోకానికి నగరంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇవ్వలేదన్నారు. అర్బన్‌లో అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఎమ్మెల్యేకు ఎప్పుడో సవాల్ చేశానన్నారు. అంతకుముందు జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ జిల్లాలో 5 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. అర్బన్ అభ్యర్థిగా ధన్‌పాల్‌ను ప్రకటించడంతో పార్టీ ఆఫీస్ వద్ద బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. పటాకులు కాల్చి, రంగులు చల్లుకున్నారు. ధన్‌పాల్ సహా కార్యకర్తలు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్పొరేటర్లు బాల్‌రాజ్, వెంకటేశ్, లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, ఎర్రం సుధీర్, బంటు రాము, పంచరెడ్డి లింగం, నారాయణ యాదవ్, మాస్టర్ శంకర్ పాల్గొన్నారు.

ఆమెదే నిర్ణయాధికారం..

- జిల్లాలో పురుషుల కంటే 71,454 మంది మహిళా ఓటర్లు ఎక్కువ
- గెలుపు ఓటములను నిర్దేశించేదీ వారే..
- మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పార్టీల రాయబారాలు
- ఇంటింటికీ దసరా కానుకల అందజేత



మోర్తాడ్(బాల్కొండ) : రాబోయే రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్దేశించే స్థాయికి మహిళలు చేరుకున్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్ల శాతం ఎక్కువగా ఉండటంతో గెలిచే అభ్యర్థి ఎవరు, తర్వాతి స్థానంలో నిలిచే వారు ఎవరని నిర్ణయించే శక్తి మహిళా ఓటర్లకే ఉందని స్పష్టమవుతోంది. జిల్లాలో బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్ నియోజకవర్గాలతో పాటు బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలున్నాయి. ఆరు నియోజకవర్గాల ఓటర్ల సంఖ్య అందులో నమోదైన మహిళా ఓటర్ల లెక్కను పరిశీలిస్తే వారి ఓట్ల సంఖ్యనే ఎక్కువగా ఉందని తేలింది. పురుషుల ఓటర్లలో అనేక మంది ఉపాధి కోసం గల్ఫ్ దేశాలతో పాటు, పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు ఉన్నారు. ఈ లెక్కన మహిళలు వేసే ఓట్లే అభ్యర్థుల గెలుపునకు కీలకం కానున్నాయి. అత్యధికంగా రూరల్ నియోజకవర్గంలోనే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండగా తర్వాత బాల్కొండ నియోజకవర్గంలో మహిళా ఓటర్ల సంఖ్య పురుషుల కంటే ఎక్కువగా ఉంది.

మహిళా ఓటర్ల కోసం గాలం..

అన్ని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో వారిని ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు ఇప్పటి నుంచి ప్రయత్నాలు మొదలు పెట్టారు. అధికార పార్టీ అభ్యర్థులు మొదట ఖరారు కావడంతో వారు దసరా, బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలకు బహుమతులను పంచిపెడుతున్నారు. చీరలు, కుక్కర్లు, గ్రైండర్లు, ఇతరత్రా గృహోపకరణాలు, అందిస్తూ మహిళా ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. మహిళలు తమవైపు ఉంటే విజయం వరిస్తుందనే ధీమాతో అభ్యర్థులు మహిళా ఓటర్లను ఆకట్టుకునే పనిలో ఉన్నారు. మహిళా ఓటర్ల తీర్పు ఎలా ఉండబోతుందో వేచి చూడాల్సి ఉంది.

ఆరు నియోజకవర్గాల్లో ఓట్ల వివరాలు

మొత్తం	13,65,811
మహిళలు	7,18,603
పురుషులు	6,47,149
ఇతర ఓటర్లు	59
అధికంగా ఉన్న మహిళలు	71,454

నియోజకవర్గం	బాల్కొండ	ఆర్మూర్	అర్బన్	రూరల్	బోధన్	బాన్సువాడ
మహిళా ఓటర్లు	1,15,898	1,09,933	1,47,571	1,32,212	1,12,381	1,00,608
పురుష ఓటర్లు	99,728	96,404	1,39,163	99,728	1,03,577	92,225
ఎక్కువున్న మహిళలు	16,170	13,529	8,408	32,484	8,804	8,383







విజయ దశమి శుభాకాంక్షలు

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య


దీపక్ (ఫైల్)

డిచ్‌పల్లి: అనారోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులతో ఒకరు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మెంట్రాజ్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన దీపక్(36) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. దీనికి తోడు చేసిన అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఎస్సై ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టగా దీపక్ మృతదేహంగా గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

శక్తివంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయం

- ఇందూరు విభాగ్ సహ కార్యవాహ వరంగంటి శ్రీనివాస్


మాట్లాడుతున్న శ్రీనివాస్

నిజామాబాద్ సిటీ: శక్తి వంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ఆర్ఎస్ఎస్ స్థాపించబడిందని ఇందూరు విభాగ్ సహ కార్యవాహ వరంగంటి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని గుర్బాబాదిరోడ్డులో ఉన్న అక్షరధామ్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన విజయదశమి ఉత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనాది కాలం నుంచి హిందుత్వం ప్రపంచానికి జ్ఞానాన్ని అందించిందని, నేడు చంద్రయాన్ ప్రయోగం విజయవంతం ద్వారా మరోసారి భారత్ విశ్వ గురువుగా నిలబడిందన్నారు. భారతీయులందరం శక్తి ఆరాధకులమని అందువల్లే వందల సంవత్సరాలు విదేశీ మూకలు దాడులు చేసినా నేటికీ మన సంస్కృతి చెక్కుచెదరకుండా ఉందన్నారు. ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవిదాస్ చందక్ మాట్లాడుతూ.. హిందుత్వాన్ని కాపాడుకోవాలని, మనం చేసే ప్రతీ పండగ వెనక గొప్ప సందేశం ఉంటుందని అన్నారు. కార్యక్రమానికి ముందు అతిథులు ఆయుధపూజ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా, నగర సంఘ చాలకులు డాక్టర్ గురుచరణం శ్రీనివాస్, నగర కార్యవాహ సత్యం, సహ కార్యవాహలు దత్తు, సుమిత్, కార్యకర్తలు, స్వయంసేవకులు పాల్గొన్నారు.



















తనిఖీల్లో నగదు పట్టివేత

ఎల్లారెడ్డి/ బోధన్ రూరల్: ఎల్లారెడ్డి మండల శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో ఒకరి నుంచి రూ. 1,47,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల ఫ్లయింగ్ టీం అధికారులు ఆదివారం తెలిపారు. ఈ నగదును కలెక్టర్ కార్యాలయానికి అందించినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీనివాస్, సత్తయ్య తెలిపారు. సాలూర, బోధన్ మండలాల్లో బోధన్ రూరల్ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సాలూర చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తుండగా మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి కారులో వస్తున్న హన్మంత్ నుంచి రూ.1,11,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. సరైన ఆధారాలు చూయించకపోవడంతో నగదు సీజ్ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



తాడ్వాయి: సంతాయిపేట్ గ్రామంలో సిద్ధిరాములుకు చెందిన పాడిగేదె కొట్టంలో విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. గేదె విలువ రూ. 50వేల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వం బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.























